నిర్మల నవ్వింది

నాయుడు సీతాదేవి

1

నిర్మల నవ్వింది.
ఆ నవ్వులో ఎంతో ఆకర్షణ ఉంది.
ఆ నవ్వులో ఏదో అంతరార్థం ఉంది.
"ఎందుకు నవ్వుతున్నావ్?"
ప్రకాశరావు ప్రశ్నించేడు.
నిర్మల సమాధానం యివ్వలేదు.
మళ్ళీ నవ్వింది.
ఆ నవ్వుల్లో ముత్యాలురాలేయి.
"మతిగాని పోయిందా?"
"అది కాదండీ?"
"ఏది కాదు?"
"నేను చెప్పను."
"పోనీ మానెయ్యి"
నిర్మల ముఖం చిన్నబోయింది.
ఉత్సాహం దిగజారిపోయింది.
"బిక్కముఖం వేశావేం?"
"చెప్పొద్దన్నారుగా."
"పోనీ చెప్పు చూద్దాం."
చెవిలో ఏదో చెప్పింది నిర్మల.
ఆయనకూ నవ్వాగలేదు.
నిర్మలకూడా నవ్వింది.
"అదా సంగతి?"
"మరేమి టనుకున్నారు?"
"అయితే అబ్బాయా? అమ్మాయా?
"ఏమో! నాకేం తెలుసు."
"పోనీ నీకెవరుకావాలో చెప్పు."
"నాకు అమ్మాయి కావాలి."
"నాకు అబ్బాయి కావాలి."
"ఊహూ! అమ్మాయి."
"ఊహూ! అబ్బాయి."
"నాకు అబ్బాయి వద్దు."
"నాకు అమ్మాయి వద్దు."
"అమ్మాయిఅయితేకట్నాలిచ్చుకోవాలి."
"అబ్బాయిఅయితేచదువుకిడబ్బుఖర్చు."
"పోనీ లాటరీ వేద్దాం."
"సరే."
"బొమ్మ అబ్బాయి-బొరుసు అమ్మాయి."
"సరే వెయ్యండి."
"నీకేం కావాలి?"
"బొరుసు."
"కాదు. బొమ్మే పడింది."
"అమ్మో! మోసం చేశారు"!
"నేనా?"
"మీరే!"
"పోనీ మళ్ళీ వేద్దాం"
"సరే ఈసారి జాగ్రత్తగా చూడాలి."
"బొమ్మా! బొరుసా?"
"బొరుసు."
"అబ్బో! బొరుసే పడింది."
"నేనే నెగ్గేను."
"యిదీ లెఖ్ఖ కాదు."
"ఎందుకని?"
"మళ్ళీ వేద్దాం."
"నేనొప్పుకోను."
"ముత్యం మూడుసార్లు."
"సరే మీ యిష్టం."
నిర్మలకు నీరసంవచ్చింది.
యింక మాట్లాడలేక పోయింది.
అంతటితో ఆగిపోయింది లాటరీ.

2

"వంట అయిందా?"
ప్రకాశరావు ప్ర ంచేడు.
"ఇంకా లేదండీ. నిరసంగా నిర్మల సమాధానం.
"మరి ఆఫీసుకి వేళవుతోంది."
"చాలా నీరసంగా ఉందండీ?"
"పనిమనిషి ఏమయింది?"
"ఈరోజు రాలేదు."
"ఇంటిపనులు నువ్వేచేస్తున్నావా?"
"ఆ!"
"చెయ్యవద్దని చెప్పలేదూ?"
"మరి ఎట్లాగ?"
"పోనీ నువ్వో పని చెయ్యి"
"ఏమిటి?"
"పుట్టింటికి వెళ్ళు."
"మరి మీరో?"
"నన్నుకూడా నీతో రమ్మన్నావా?"
"చాల్లెండి మీ వేళాకోళం."
"నేను హోటల్లో తింటాను."
"ఆరోగ్యం పాడవుతుంది."
"ఫర్వాలేదు."
"సరే కానీ..."
"ఏమిటది?"
"రాత్రిళ్ళు ఇల్లు కదలకు! కదా!"
"మంచి అనుమానమే."
నిర్మల పుట్టింకి వెళ్ళింది.
ప్రకాశరావుది, ఒంటరి జీవితం.
హోటలుభోజనం.
గడవని రోజులు.
గడురోజులు.
కాలచక్రం గిర్రున తిరిగింది.
నవమాసాలు నిండేయి.
నిర్మలకు కవల పిల్లలు.
ఒక అబ్బాయి.
ఒక అమ్మాయి.
ఇద్దర్నీ ఎత్తుకుని ఇంటికి వచ్చింది.
ప్రకాశరావు నవ్వేడు.
నిర్మలా నవ్వింది.
పిల్లవాణ్ణి ఎత్తుకోమంది.
ఆయన అబ్బాయిని ఎత్తుకున్నాడు.
ఆవిడ అమ్మాయిని ఎత్తుకుంది.
ఇంతకూ ఎవరి పంతం నెగ్గినట్టు?

"నా పంతం నెగ్గింది." ధైర్యంగా అంది నిర్మల.

"నా పంతమూ నెగ్గింది. నీకు అమ్మాయి కావాలిగా! నువ్వే కట్నం యిచ్చి పెళ్ళి చేసుకో. నాకు అబ్బాయి కావాలి. నేనే చదివించుకుంటాను" నిర్భయంగా అన్నాడు ప్రకాశరావు.

"అయితే మనకు మాటల్లేవు."
"ఏం?"
"మీరు మాతో మాట్లాడకూడదు."
"అదేమిటి?"

"మీరూ అబ్బాయి వేరు, నేనూ అమ్మాయి వేరు."

ప్రకాశరావుకి షాక్ తగిలింది.
నోట్లో పచ్చివెలక్కాయపడింది.
నిర్మల నవ్వింది.
ఆయనా నవ్వేడు. ★

వైటోడెంట్
దంతక్రిములను
సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30.